సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 18 । మార్చి । 2023



పెనుశిల అభయారణ్యంలో అరుదైన జంతువులు

పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయారణ్యాన్ని టైగర్ కారిడార్‌గా చూడాలన్నదే లక్ష్యమని రేంజ్ ఆఫీసర్ అన్నారు. -IIలో..



యువజనం..సేవా సైన్యం

స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని మదనపల్లెకు చెందిన యువకులు సమాజ సేవకు పూనుకున్నారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 176 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	550
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 97.74 కిలోలు

అకాల వర్షం.. రైతుకు నష్టం

- దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- రామసముద్రంలో 29.2, గాలివీడులో 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి నెట్ వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన తేమ గాలుల ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో రెండు రోజులుగా అకాల వర్షాలు పడుతున్నాయి. జిల్లా పరిధిలోని రామసముద్రంలో 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా పెద్దతిప్పసముద్రంలో 28, తంబళ్లపల్లిలో 22.4, వీరబల్లి 20.2, బి కొత్తపేటలో 19.2, పెద్దమండెంలో 16.6, ములకల చెరువు 15.8, మదనపల్లి 15.6, వాల్మీకిపురంలో 13.2, గాలివీడు మండలంలో 10.2 మిల్లీమీటర్లు వంతున వర్షం కురిసిందిఈదురుగాలులకు జిల్లాలోని మదనపల్లె తంబళ్లపల్లె పీలేరు నియోజకవర్గాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మదనపల్లె పట్టణంలోని ఎంఎల్ఎల్ ఆస్పత్రి నుంచి మోతీనగర్‌కు వెళ్లే రహదారి, ఎస్‌జేఆర్.కల్యాణమండపం, ప్రశాంత్‌నగర్, సుందర్‌రాజ్ పెట్రోల్‌బంక్ ఎదురుగా, ఎన్‌టీఆర్ సర్కిల్‌లో పలులోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రోడ్లపై వడగళ్లు పెద్దసైజులో పడుతుండటంతో ప్రధానరహదారిపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు రెండుగంటల సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మదనపల్లె మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వడగండ్లు, గాలివాన బీభత్సానికి 130 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెలో అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ కత్తిరాజుతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. అకాలవర్షం, వడగళ్ల దెబ్బకు 130 ఎకరాల పంట నష్టం జరిగిందని అంచనా వేయగా..అందులో టమాటా..110, బొప్పాయి..6, అల్లనేరేడు..6, మామిడి..3, తమలపాకులు..2, బీన్స్...2 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు.

- వాల్మీకిపురం మండలంలో దాదాపు 50 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మండలంలోని ప్యారంపల్లి, జర్రావారిపల్లి, ఓబులంపల్లి, ఫత్తేపురం తదితర ప్రాంతాల్లో టమోటా, మిరప, బొప్పాయి తదితర పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఓబులవారిపల్లె మండలం వైకోట అటవీప్రాంత సమీపంలో కురిసిన అకాల వర్షం, గాలులకు అరటి తోటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. కర్బూజ, దోస పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు 5 ఎకరాల్లో అరటి తోట దెబ్బతింది.
- నిమ్మనపల్లె మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం వడ్లగండ్ల వర్షం కురిసింది. కొందరు గిన్నెలు,దోసిళ్లల్లో వాటిని పట్టుకున్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మండలంలో ఉద్యానపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు నష్టపోయారు. మామిడి, టమాటా, బొప్పాయి తదితర పంటలు నేలకూలాయి. రైతుభరోసా కేంద్ర సిబ్బంది సంబంధిత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనా వేస్తున్నారు. మండలపరిధిలో 80 ఎకరాలకు పైగా ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. ఇందులో టమాటా..66, బొప్పాయి..6, మామిడి..3, మిరప..2, బెండ..3 ఎకరాల్లో దెబ్బతింది.



వైకోట అటవీ సమీప ప్రాంతంలో నేలకొరిగిన అరటిచెట్లు



నిమ్మనపల్లె: నేలకొరిగిన బొప్పాయిపంట

మండలం కురిసిన వర్షం(మి.మీ)

గాలివీడు	10.2	కోడూరు	2.8
చిన్నమండెం	9.0	ములకలచెరువు	15.8
సంబేపల్లె	11.7	తంబళ్లపల్లె	22.4
టి.సుండుపల్లె	8.9	పెద్దమండెం	16.6
రాయచోటి	9.8	గుర్రంకొండ	12.5
లక్కిరెడ్డిపల్లె	4.6	కలకడ	3.3
రామాపురం	9.8	కంబవారిపల్లె	6.5
వీరబల్లె	20.2	పీలేరు	6.4
నందలూరు	2.8	కలికిరి	3.7
పెనగలూరు	3.8	వాల్మీకిపురం	13.2
చిట్వేల్	9.4	కురుబలకోట	12.8
రాజంపేట	5.4	బి. కొత్తకోట	19.2
పుల్లంపేట	9.5	మదనపల్లె	15.6
ఓబులవారిపల్లె	3.0	నిమ్మనపల్లె	6.0



మదనపల్లెపట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం



వాల్మీకిపురం: టమోటా పంటను చూపుతున్న రైతు శ్రీనివాసులు రెడ్డి.



రాచవేటివారిపల్లెలో నేలవాలిన మామిడితోటను చూపిస్తున్న రైతు

బాధ్యతలు స్వీకరించిన డీఈఓ



సాయిరామ్ పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

రాయచోటి: అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారిగా సాయి రామ్ పురుషోత్తం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. స్థానికంగా పని చేస్తున్న డీఈఓ రాఘవరెడ్డిని వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. డీఈఓ కార్యాలయానికి చేరుకున్న పురుషోత్తంకు కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు స్వాగతం పలికారు.

పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ పురుషోత్తం అన్నారు. శుక్రవారం డీఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నింటికీ అడ్డుగా నిలిచిన కరోనాకాలం ముగిసిపోయిందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసిందన్నారు. పదోతరగతిలో మెరిట్ విద్యార్థులతోపాటు చదువులో వెనుకబడిన వారిని కూడా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రచించారన్నారు. పరీక్ష ముందురోజు వరకు విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకమై వారిలో కార్పొరేట్ విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మంచి మార్కులను సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారన్నారు. పేద విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు రాకూడదన్న సదుద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల పరిస్థితులపై త్వరలోనే అవగాహన కల్పించుకొని జిల్లాలో ఉన్నతమైన విద్యా వ్యాప్తికి కృషి చేస్తామని పురుషోత్తం ఈ సందర్భంగా తెలిపారు.

న్యూస్‌రీల్

ఇద్దరు వెల్ఫేర్ అసిస్టెంట్ల సస్పెన్షన్

పీలేరురూరల్: విధి నిర్వహణలో అలసత్వం, అవినీతికి పాల్పడిన ఇద్దరు వెల్ఫేర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డి. ద్వారకనాథనాయుడు నవరత్నాలు పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం , పెన్షన్ పంపిణీ చేసేందుకు నగదు సక్రమంగా అందించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, సమావేశాలకు హాజరు కాకపోవడం, సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు రూ. 13 వేలు చెల్లింకపోవడం వంటి కారణాలతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే కేవీపల్లె మండలం ఎంపీపల్లె గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి. వెంకటమణారెడ్డిని పైన పేర్కొన్న కారణాలతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

85 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీ లక్ష్యం



గోడౌన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరురూరల్: 2023 ఖరీఫ్ సాగుకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు 85 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా అధికారి ఎస్. సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పీలేరులోని వేర్ హౌస్ గోడౌన్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ముందుగా పడుతున్నాయని, రైతుల అవసరాల మేరకు చిత్తూరు జిల్లాకు 60 వేల క్వింటాళ్లు, తిరుపతి జిల్లాకు 25 వేల క్వింటాళ్ల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే ఆరుతడి పంటల కింద అలసంద, మినుము, పెసర్లు, కొర్రలు, రాగి విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు కె. రాజేంద్ర, ఎస్. చాణుక్య పాల్గొన్నారు.

19న ఆంధ్ర కబడ్డీ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: జాతీయస్థాయి సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టు ఎంపికలు ఈనెల 19న పోటీలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ షేక్‌షఫీ తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగే పోటీల్లో ఎంపికైన క్రీడాకారిణులు మార్చి 23 నుంచి 29 వరకు హర్యానాలో జరిగే 69వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

పోలి గ్రామంలో కేంద్రీయవిద్యాలయం



మాట్లాడుతున్న సుబ్రమణ్యంరెడ్డి

రాజంపేట రూరల్: రాజంపేట-నెల్లూరు రహదారిలోని చరిత్రాత్మక గ్రామమైన పోలిలో కేంద్రీయ విద్యాలయం నిర్మితం కానుంది. శుక్రవారం పోలి రెవెన్యూ గ్రామపరిధిలో 7.32 ఎకరాలు ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కేటాయింపులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ స్థలం కేటాయిస్తూ జిల్లా కలెక్టరు గిరీషా పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పోలి గ్రామపరిధిలో 1802/4. 1802/5, 1813లో ఉన్న 7.32 ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయం సంగతన్‌కు అప్పగించనున్నట్లు చెప్పారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ



రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని, తనిఖీ చేస్తున్న డీఐఈవో కృష్ణయ్య

రాయచోటిటౌన్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని కేంద్రాలను డీఐఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 14,085 మంది హాజరు కావాల్సి ఉండగా 13,535 హాజరయ్యారు. వీరిలో ఒక విద్యార్థి డీబారయ్యారు. 549 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల రాసే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని డీఐఈవో చెప్పారు.

వసతిగృహం, విద్యాలయం తనిఖీ

వల్లూరు: వైఎస్సార్ జిల్లా వల్లూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని , కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట వల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ చదవుతున్న ఆరోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లీషు సబ్జెక్టులో అంబేడ్కర్ పాఠ్యంశాన్ని గురించి ప్రశ్నించారు. దీనికి సంబంధించి నోట్‌బుక్‌లను ఉపాధ్యాయులు కరెక్షన్ చేయక పోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్‌ను విజిట్ చేసి నోట్‌బుక్‌లను కరెక్షన్ చేయని ఉపాధ్యాయులపై డీఈవోకు ఫిర్యాదు చేయనందుకు ఎంఈవోకు, సంబందిత ఉపాధ్యాయునికి మెమో ఇవ్వాలని డీఈవోను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. బైజ్యూస్ కంటెంట్ గురించి ఆరా తీశారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రాఘవరెడ్డి, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కడప ఎడ్యుకేషన్: విధుల పట్ల ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి కడప నగరంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలతోపాటు ఉర్దూ రెసిడెన్సియల్ స్కూల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడ విద్యార్థులకు సరైన వసతులు లేవని గుర్తించారు. అక్కడ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ ఆర్‌జేడీ రవిని ఆదేశించారు. ఈయన వెంట ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి, ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల డీఈఓలు ఎద్దుల రాఘవరెడ్డి, పురుషోత్తం, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



వల్లూరులోని బాలుర హాస్టల్‌లో విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలిస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

డీటీపీఓగా పి.రాము



రాయచోటి అర్బన్: అన్నమయ్యజిల్లా ఆర్టీసీ డీటీపీఓగా (జిల్లా ప్రజారవాణా అధికారి) పి.రాము శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.విజయనగరం ఏపీఎస్ ఆర్టీసీ జోనల్‌వర్క్‌షాప్ స్టోర్స్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న రాము బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జగదీష్ విజయనగరానికి బదిలీపై వెళ్లారు. కాగా బాధ్యతలు చేపట్టిన టీటీపీఓను పలుడిపోల డీఎంలు, యూనియన్‌ల నేతలు కలసి అభినందనలు తెలిపారు.

షాదీమహల్‌కు తాళం..
టీడీపీదే బ్యాండుమేళం

- వాస్తవాలు మరిచి ప్రభుత్వంపై లోకేష్ నిందలు
- 2018 నుంచీ తాళమే
- సౌకర్యాలు కల్పించకుండానే ప్రారంభం

బి.కొత్తకోట: పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ బి.కొత్తకోటలో షాదీమహల్‌ను చూసి 'మైనార్టీల కోసం టీడీపీ హయాంలో నిర్మించిన షాదీమహల్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు తాళం వేశారు. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తిరస్కరిస్తున్నారు' అంటూ సెల్ఫీ తీసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్థానిక ముస్లిం వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. షాదీమహల్‌కు తాళం వేసిన పాపం నూటికి నూరుపాళ్లు టీడీపీ ప్రభుత్వానిదేనని అంటున్నాయి. వాస్తవాలు మరుగుపరచి లోకేష్ రాజకీయం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోందంటున్నాయి. షాదీమహల్‌కు సంబంధించిన వాస్తవ విషయాలివి..

టీడీపీ హయాంలోనే..

2016లో బి.కొత్తకోటకు షాదీమహల్ మంజూరైంది. నిర్మాణం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.50లక్షలు మంజూరయ్యాయి. పీఆర్‌శాఖ అధికారులు దీని నిర్మాణం చేపట్టారు. 2016 జూలై, 7న అప్పటి టీడీపీ ఎమ్మెల్యే జి.శంకర్ నిర్మాణ పనులకు స్థానిక ఈద్గాహ్ వద్ద శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తవడంతో 2018 ఆగస్టు, 16న షాదీమహల్‌ను ప్రారంభించి సభ నిర్వహించారు. అయితే కేవలం భవనం మాత్రమే అప్పటికి పూర్తయింది. అందులో వివాహాలు, ఇతరా శుభకార్యాలు జరుపుకునేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించలేదు. ప్రధానంగా తాగునీటి వసతిని విస్మరించారు. బోరువేయించాలని టీడీపీ ముస్లిం నాయకులు ప్రారంభోత్సవ సభలోనే విన్నవించారు. అయినా పట్టించుకోలేదు. ప్రారంభం రోజు షాదీమహల్ తెరిపించి, తర్వాతి రోజు నుంచే దానికి తాళం వేశారు. అప్పుడు వేసిన తాళమే ఇప్పటికీ ఉంది. షాదీమహల్‌ను పూర్తి హంగులతో ప్రారంభించాల్సి ఉండగా, విస్మరించిన నాటి ఎమ్మెల్యే శంకర్ నిర్లక్ష్యం కూడా ఉంది. ముస్లింల కోసం షాదీమహల్ నిర్మించినా ఆయన పదవీ కాలం పూర్తయ్యే వరకు ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేకపోయారో లోకేష్ ఆరా తీయాల్సింది. వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వంపై నిందలేయడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బి.కొత్తకోట షాదీమహల్

లోకేష్ వాస్తవాలు తెలుసుకోవాలి



షాదీమహల్ ప్రారంభం నుంచి ఎందుకు మూతపడిందో లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడి ఉండాల్సింది. రోడ్డుపై పాదయాత్రగా వెళ్తూ కనిపించింది కదా అని షాదీమహల్‌కు తాళం వేసింది వైఎస్సార్‌సీపీ నాయకులంటూ ఆరోపించడం ఆయనకు తగదు. ఇలాంటి తప్పుడు ఆరోపణలతో లోకేష్ అసమర్థత బయటపడుతోంది.

– పాగొండ ఖలీల్, మాజీ ఎంపీపీ, బి.కొత్తకోట

టీచర్స్ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీదే

- ఎమ్మెల్సీగా ఎంవీ రామచంద్రారెడ్డి ఎన్నిక
- రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంవీ రామచంద్రారెడ్డి విజయం సాధించారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మధ్య నడిచింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. 169 ఓట్లతో రామచంద్రారెడ్డి గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రకటించారు.

రౌండు రౌండులో ఉత్కంఠ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి రౌండులోనూ ఉత్కంఠ కొనసాగింది. 25 వేల పైచిలుకు ఓట్లు పోలవగా.. ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే 10 వేల మార్కు దాటింది. మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పది మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు ఎంవీ రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మిగిలారు. వాస్తవానికి పోలైన ఓట్లలో 50 శాతం సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. కానీ రెండో ప్రాధాన్యతలో కూడా ఎవరూ 50 శాతం ఓట్లు సాధించలేదు. ఈ దశలో నిబంధనల ప్రకారం విజేతను ప్రకటించవచ్చు. ఇందులో భాగంగానే 169 ఓట్ల ఆధిక్యత ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని విజేతగా నిర్ణయించారు.

ఆసక్తిరేపిన ఎలిమినేషన్

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ అందరిలోనూ ఆసక్తి రేపింది. రామచంద్రారెడ్డి, ఒంటేరు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొనడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో, ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూశారు. ముఖ్యంగా మూడోస్థానంలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని ఎలిమినేట్ చేసే క్రమంలో ఆయన బ్యాలెట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగతా ఇద్దరు అభ్యర్థులకు కేటాయించే సమయంలో విజయం దోబూచులాడింది. ఈ ఓట్లలో ఎక్కువ శాతం ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వెళ్లడంతో ఆయన విజయం ఖాయమనుకున్నారు. కానీ చివరకు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక చూస్తే రామచంద్రారెడ్డికే ఆధిక్యత లభించింది.

సీఎం ఆశీస్సులతోనే విజయం

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని ఎం.వి.రామచంద్రారెడ్డి తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు శుక్రవారం జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

విజేత రామచంద్రారెడ్డి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది పోటీ చేశారని ఆర్‌ఓ, కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ప్రాథమిక ఓట్లను బదిలీ చేస్తూ పోగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పోటీలో నిలిచారన్నారు. ప్రాధాన్యత ఓట్ల బదిలీ తర్వాత ఎవరికీ 50 శాతంపైగా ఓట్లు దక్కలేదన్నారు. దీంతో అత్యధిక ఓట్లు సాధించిన రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించామని రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు.



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

'తొలి ప్రాధాన్యత'లో అభ్యర్థుల వారీ ఓట్లు

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	6,853
కత్తి నరసింహారెడ్డి	4,162
అనిల్ ప్రసాద్‌రెడ్డి	3,212
జీవీ నారాయణరెడ్డి	1,345
ఎంవీ రామచంద్రారెడ్డి	8,846
అనిల్‌కుమార్‌రెడ్డి	186
ఎస్.మాధవరావు	354
రామశేషయ్య	187

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితమిలా..

మొత్తం పోలైనవి	25,272
చెల్లని ఓట్లు	3,867
ఎంవీ రామచంద్రారెడ్డి	10,787
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	10,618
మెజారిటీ	169

సమస్యల పరిష్కారానికి కృషి



పూలమాలలో అభినందిస్తున్న అభిమానులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అనంతపురంలో గురువారం నిర్వహించిన ఎన్నికల కౌటింగ్‌లో విజయం సాధించి శుక్రవారం కడపకు చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. అనంతరం సాయిబాబా విద్యాసంస్థల డైరెక్టర్, స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి, అభిమానుల మధ్య కట్‌చేశారు. రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్, పీఎస్‌టీయూ, పీఆర్‌టీయూ, ఎస్టీఎఫ్, పీడీ అసోసియేషన్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి తదితరు శుభాకాంక్షాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు

కూతురిని విదేశాలకు సాగనంపి వస్తుండగా..

● కర్ణాటకలో మదనపల్లె దంపతుల దుర్మరణం ● కారు బోల్తాతో ఘటన


బోల్తా పడిన కారు


షఫీవుల్లా, షాహీనాబేగం (ఫైల్)

మదనపల్లె : కన్నకూతురిని ఉన్నత చదువుల కోసం విదేశాలకు సాగనంపి.. సంతోషంగా తిరిగి వస్తున్న దంపతులను విధి చిన్నచూపు చూసింది. కర్ణాటక రాష్ట్రం లక్ష్మీపురం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లెలోని కోటవీధికి చెందిన అమీన్ స్టోన్‌క్రషర్స్ యజమాని షఫీవుల్లా, ఆయన భార్య షాహీనబేగం దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోటవీధికి చెందిన షఫీవుల్లా(55) సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తూ, పట్టణంలోని హజరత్ మస్తాన్‌వలీ కమిటీ దర్గా సభ్యులుగా కొనసాగుతున్నారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన షాహీనాబేగం(50)కు షఫీవుల్లాతో వివాహం జరిగింది. ఈమె విద్యావంతురాలు. వివాహానికి ముందు అధ్యాపకురాలుగా పని చేశారు. వీరికి షాదు, షైమా, షిఫా అనే ముగ్గురు కుమార్తెలు. షాదు, షైమాలకు వివాహమైంది. చిన్నకూతురు షిఫా విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు దరఖాస్తు చేసుకోగా అనుమతి లభించడంతో.. గురువారం రాత్రి కారులో కుమార్తెతో కలిసి బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం వేకువజామున కుమార్తె షిఫాను విమానం ఎక్కించి మదనపల్లెకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం తాలూకా లక్ష్మీపురం క్రాస్ వద్ద రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండటం, విశ్రాంతి లేకుండా వాహనాన్ని నడుపుతుండటంతో నిద్రముంచుకురావడంతో అదుపు తప్పి సుమారు 10 అడుగుల లోతులోకి కారు బోల్తా పడింది. కారులోనే దంపతులిద్దరూ మృతి చెందారు. ఉదయం అటుగా వచ్చిన స్థానికులు సమాచారం అందించడంతో.. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతులను మదనపల్లెకు చెందిన వారుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం శ్రీనివాసపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కర్ణాటకలోని రోడ్డుప్రమాదంలో పట్టణంలోని కోటవీధికి చెందిన దంపతులిద్దరూ మరణించిన వార్త తెలియడంతో.. స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

యువజనం.. సేవా సైన్యం

- ఇద్దరితో ఆరంభమై వేలాది మందికి చేరిన వైనం
- ఆపదలో ఆప్తులై .. సమాజ సేవకులై..
- పలువురికి ఆదర్శనీయం

యువశక్తి తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ ఉండదని స్వామి వివేకానందుడు ఆనాడే చెప్పారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని మదనపల్లె యువజనం ముందుకు కదిలారు. చదువు, లక్ష్యం, జీవిత స్థిరత్వమే కాదు.. ఆపదలో ఆప్తులై.. సమాజ సేవలోనూ దూసుకెళ్తున్నారు. అందుబాటులో ఉన్న సోషల్ మీడియా ద్వారా ఉద్యమంలా చేస్తున్నారు. – మదనపల్లె సిటీ

సామాజిక సేవలో..


పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సేదా ఫౌండేషన్ సభ్యులు

మదనపల్లెలో సేదా ఫౌండేషన్ సామాజిక సేవలు అందిస్తోంది. 2018లో పఠాన్ ఖాదర్‌ఖాన్ ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. కరోనా మొదటి, రెండవ వేవ్‌లలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లాక్‌డౌన్ సమయంలో చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించారు. బస్టాండులో ఉన్న నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేశారు. నిరుపేదల వివాహాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆకలిలో అలమటించే వారికి అన్నదానాలు చేస్తున్నారు. ప్రతి ఏడాది వినాయకచవితికి మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. సంస్థలో పది మందితో మొదలై ప్రస్తుతం 600 మంది వరకు ఉన్నారు.

స్నేహితులం కలిసి నడుపుతున్నాం



సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం. స్నేహితులం కలిసి సంస్థను నడుపుతున్నాం. ఎవరైనా ఆపదలో ఉన్నట్లు తమను సంప్రదిస్తే చేతనైనంత సాయం చేస్తాం.

- పఠాన్ ఖాదర్‌ఖాన్, సేదా సంస్థ వ్యవస్థాపకులు, మదనపల్లె

ఆపన్నులకు అండగా..

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని వివేకానంద మున్సిపల్ పాఠశాలలో చదివిన విద్యార్థులు.. స్వామి వివేకానంద ఆశయాలతో ఏదైనా సేవ కార్యక్రమాలు చేయాలనుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల పేరిట వివేకానంద ఆశయం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఇద్దరితో మొదలైన సంస్థ ఇప్పుడు 3 వేల మందితో వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన ఇంటర్ విద్యార్థికి బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ రూ.30 లక్షలు అవసరమైంది. బాధితుడు అదే పాఠశాల విద్యార్థి కావడంతో సంస్థ సభ్యులందరూ కలిసి రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు. దీంతోపాటు రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, అన్నదానాలు, ప్రతి నెల మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


రక్తదానం చేస్తున్న వివేకానంద ఆశయ ఫౌండేషన్ సభ్యులు

మరిన్ని కార్యక్రమాలు

మదనపల్లెతోపాటు తిరుపతి, పుంగనూరు, ములకలచెరువు, వైజాగ్, బెంగుళూరు, హిందూపురం, విజయవాడ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు. సంస్థను భానుప్రకాష్‌తో పాటు దేవేంద్ర, సాయిలీల, హరిత, కీర్తన, దినేష్‌లు ఏర్పాటు చేశారు.

చేతనైనంత సాయం



వివేకానంద ఆశయం ఫౌండేషన్‌లో ఎంతో మంది సభ్యులున్నారు. ఎక్కడైనా సాయం అవసరం అయితే సభ్యులంతా చేతనైన సాయం అందిస్తున్నారు.

- భానుప్రకాష్, ఫౌండర్, వివేకానంద ఆశయం ఫౌండేషన్, మదనపల్లె

యువశక్తి... స్ఫూర్తి మంత్రం


గణేష్

మదనపల్లె పట్టణానికి చెందిన రెడ్డి గణేష్.. యువశక్తి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. మిత్రులతో కలిసి పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిమ్మనపల్లె మండలానికి చెందిన ఓ యువకుడు కిడ్నీ ఫెయిల్ కావడంతో.. రూ.65 వేల ఆర్థిక సాయం అందించారు. పట్టణంలో అనాథలకు ఫుడ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళుతున్నారు.


చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యువశక్తి సభ్యులు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

సిద్దవటం : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని భాకరాపేటలో శుక్రవారం సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన రైతులకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణపై అవగాహన సమావేశం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీఓ మాట్లాడుతూ కడప నుంచి చిన్న ఓరంపాడు వరకు ఎన్‌హెచ్ 716 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రైతులకు పర్యావరణంపై ఈ సమావేశంను నిర్వహించడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణలో కొంత మేరకు ఫారెస్టు, కొంత మేరకు పచ్చదనం దెబ్బతింటుందన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, కట్టడాలు కోల్పోయే రైతులకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు కొత్త ధరల ప్రకారం వీలైనంత ఎక్కువగా పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హరిక్రిష్ణ మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో 29 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి 116 హెక్టార్ల భూమిని తీసుకోవడం జరిగిందన్నారు. 13 ప్రాంతాల్లో చిన్న చిన్న బ్రిడ్జిల నిర్మాణం, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు 11 ప్రాంతాల్లో వెహికల్ అండర్ ప్రాసెస్, అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు, జంతువులకు మూడు చోట్ల అనిమల్ అండర్ ప్రాసెస్ ఏర్పాటు చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం దాదాపు రూ.30 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. భూములు కోల్పోయే రైతులు లేవనెత్తిన అనుమానాలను ఆర్డీఓ నివృత్తి చేశారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఇంజనీర్ జావిద్ బాషా, సిద్దవటం, ఒంటిమిట్ట తహసీల్దారులు శంకర్‌రావు, శ్రీనివాసులరెడ్డి, ఎస్ఐలు తులసీ నాగప్రసాద్, మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వీఆర్వో నాని, మండల సర్వేయర్ సుధాకర్, సర్పంచ్ తుర్రా చిన్నక్క, స్థానిక నాయకులు కె.వి సుబ్బయ్య, తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

టైల్స్ మీద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


మృతి చెందిన విశ్వనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండల పరిధి మాచునూరు గ్రామ పంచాయతీలోని అరవేటిపల్లెలో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు టైల్స్ మీద పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సి.విశ్వనాథ్‌రెడ్డి(28) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేస్తూ.. ఇంటి వద్ద నుంచే పని (వర్క్ ఫ్రం హోమ్) చేస్తున్నాడు. తన ఇంటిపై నిర్మిస్తున్న మొదటి అంతస్తులో గురువారం రాత్రి ఉండగా.. బలమైన ఈదురుగాలులు వీచాయి. ఇంటికి వాడే టైల్స్ పక్కన గోడకు ఆనించి ఉండగా.. అవి కాలు మీద పడ్డాయి. మోకాలు వెనుక వైపు పాదం వరకు కోసుకొని పోయింది. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. ఉద్యోగం చేస్తున్న కన్న కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. బంధువులలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పెనుశిల అభయారణ్యంలో అరుదైన జంతువులు



పెనుశిల అభయారణ్యంలో గుర్తించిన చిరుతపులి (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రేంజర్ నారాయణ

చిట్వేలి : పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయారణ్యాన్ని టైగర్ కారిడార్‌గా చూడాలన్నదే అటవీ శాఖ అధికారుల లక్ష్యమని చిట్వేలి రేజ్ ఆఫీసర్ ఆర్.నారాయణ పేర్కొన్నారు. చిట్వేలి ఫారెస్టు కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ అనుమతి మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 1997 సెప్టెంబర్ 15 నుంచి జీఓ నంబరు 106 ప్రకారం వైఎస్ఆర్, నెల్లూరు జిల్లాల పరిధిలోని 1038.35 చదరపు కిలోమీటర్ల మేర విస్తీర్ణాన్ని లక్ష్మీనరసింహస్వామి అభయారణ్యంగా గుర్తించడం జరిగిందన్నారు. సోమశిల వెనుక జలాల ప్రాజెక్టు మూలంగా అన్ని రకాల జంతువులకు స్థావరంగా ఇక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా టైగర్ కారిడార్‌ను గుర్తించేందుకు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు వారి సాయంతో రాజుకుంట, కొండూరు పరిధిలో ఫిబ్రవరి 22వ తేది నుంచి 20 రోజుల పాటు పది పాయింట్ల వద్ద రెండు కెమెరాలు చొప్పున 20 కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మూడు చిరుత పులులను గుర్తించామని, అంతేకాకుండా నెమలి, కొనతులు, ముళ్ళపందులు, కొండగొర్రె, ఎలుగుబంట్లు ఇలా పలు రకాల జంతువుల ఫొటోలను కెమెరాలు తీశాయన్నారు. ఈ ప్రాజెక్టు మరో 20 రోజులపాటు కొనసాగుతుందని అన్నారు. కాగా పులిని గుర్తించడం ప్రధాన మూలంగా ఈ ప్రాజెక్టు కొనసాగుతుందన్నారు. ఈ అభయారణ్యం ఎకోసైన్స్ జోన్‌గా పరిగణించారని, కావున అటవీ అధికారుల అనుమతి లేనిదే ప్రవేశం లేదని పేర్కొన్నారు. అడవి భూభాగంలోకి రెండు కిలోమీటర్ల పరిధికి దూరంగా ఉండాలని, అటవీ సమీపాన ప్రాజెక్టులు, ఎర్రచందనం తదితర పనులు నిషిద్ధమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు, కొండూరు ఎఫ్ఎస్ఓ ఎస్ సావిత్రి, రాజుకుంట, కొండూరు బీట్ ఆఫీసర్లు వెంకట సుబ్బమ్మ, కరిముల్లా బాషా, కేవీ సుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– మరొకరికి గాయాలు

సంబేపల్లె : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై దేవపట్ల మిట్ట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మాసాపేటకు చెందిన సోమల ఆదినారాయణ(46), జరుగు ఉమాశంకర్‌రెడ్డి సంబేపల్లె మండలం దేవపట్ల మిట్టవద్ద అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఒక వ్యక్తిని కలిసి తిరిగి రాయచోటి వెళ్లడానికి సిద్ధమయ్యారు. సమీపంలో బస్‌స్టేజి ఉండటంతో అక్కడికి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. వారిని పీలేరు వైపు నుంచి రాయచోటికి వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, ఉమాశంకర్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదినారాయణకు భార్య మాధవీలత, ముగ్గురు కుమారులు ఉన్నారు. వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అయ్యో పాపం

సంఘటన చూసిన మృతుడి భార్య అదే రహదారిపై బస్సులో వెళ్తూ రోడ్డు ప్రమాదాలు మామూలే అని వెళ్లిపోయింది. అయితే ఆ ప్రమాదంలో మృతి చెందింది తన భర్త అని తెలుసుకోలేక పోయింది. మార్గంమధ్యలో తనకు ఫోన్ రావడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఈ విషయం తెలిసిన పలువురు 'అయ్యో పాపం' అంటూ విచారం వ్యక్తం చేశారు.

బైక్ అదుపుతప్పి అన్నదమ్ములకు గాయాలు

నిమ్మనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అగ్రహారం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన గుర్రప్ప కుమారులు గురునాథ్(29), జగదీష్(28), గణేష్(26) ముగ్గురు కలిసి బైక్‌పై వాల్మీకిపురం మండలం చింతపర్తికి వ్యక్తిగత పనులపై వెళ్లారు. తిరుగుప్రయాణంలో నిమ్మనపల్లె–చింతపర్తి మార్గంలోని ఆరిపిరెడ్డిగారిపల్లె వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, స్థానికులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో ఈ నెల 15న ఓ వివాహితను లారీ కింద తోసి హత్య చేసిన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జి.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐలమ్మ కాలనీకి చెందిన అమిలిపోగు లక్ష్మీదేవి బుధవారం రాత్రి ఇంటికి వెళుతున్న సమయంలో.. మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన ఎల్లుర్తి చంద్రశేఖర్ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిని ఆమె ప్రతిఘటించడంతోపాటు అతడిని దూషించింది. అయినప్పటికీ వెంటపడుతూ వేధిస్తుండటంతో ఫోన్‌లో తన భర్తకు, తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతోపాటు చంద్రశేఖర్‌ను తన ఫోన్‌లో ఫొటో తీసింది. దీంతో ఆవేశానికి లోనైన చంద్రశేఖర్ లక్ష్మీదేవిని బలంగా తోసేయడంతో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేశారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐలు కత్తివెంకటరమణ, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మ్యాన్‌కు గాయాలు

కలసపాడు : మండలంలోని రాజుపాలెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై రాజుపాలెం సచివాలయ విద్యుత్ ఉద్యోగి సురేష్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం ఒక లైన్‌కు ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేస్తుండగా దానిపైన మరో లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సిబ్బంది, రైతులు గమనించి కరెంటు ఆఫ్ చేసి విద్యుత్ స్తంభం నుంచి కిందికి దించారు. కలసపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహా మేరకు పోరుమామిళ్లకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. విద్యుత్ అధికారుల తప్పిదం వల్లే ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

వడగండ్ల వర్షానికి 130 గొర్రెలు మృతి

పెద్దముడియం : మండలంలోని పాలూరు గ్రామ పొలాల్లో వడగండ్ల వర్షానికి 130 గొర్రెలు మృతి చెందాయి. ముద్దనూరు మండలంలోని యామవరం, దుద్దేల గ్రామాలకు చెందిన కాపరులు తమ గొర్రెలను మండంలోని పాలూరు గ్రామ పొలాల్లో పది రోజుల నుంచి మేపుతున్నారు. గురువారం రాత్రి తుపాను ప్రభావంతో వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల ధాటికి తట్టుకోలేక 47 గొర్రెలు, 83 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెల యజమానులు వాపోయారు.

నేటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు


అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఉత్సవ ఏర్పాట్లు

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 520 వర్ధంతి ఉత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లను పూర్తి చేసింది. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తాళ్లపాకలో ధ్యానమందిర ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఉత్సవాలకు సిద్ధం చేశారు. కడప–రేణిగుంట హైవేలోని అన్నమయ్య థీంపార్కు, తాళ్లపాక ఆర్చి వద్ద స్వాగత తోరణాలను నెలకొల్పారు. విద్యుద్దీపాలంకరణ, లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

నేడు సంకీర్తన గోష్ఠిగానం

తాళ్లపాక గ్రామంలో శనివారం ఉదయం 8 గంటలకు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు. నాదస్వర సమ్మేళనం కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ వెల్లడించింది. రోజూ సాయంత్రం వేళలో సంగీత సభలు, హరికథ కాలక్షేప కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఉత్సవాలకు భక్తులు హాజరై జయప్రదం చేయాలని టీటీడీ పిలుపు నిచ్చింది.

చావుబతుకుల్లో ఉన్న బిడ్డను బతికించండి

ప్రెస్‌క్లబ్‌లో తల్లిదండ్రుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న కాంతమ్మ

మదనపల్లె : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా, ఎమర్జెన్సీ డోర్ తెరచుకుని కిందపడి ప్రాణాపాయస్థితిలో ఉన్నటువంటి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సుబ్రహ్మణ్యం, కాంతమ్మ దంపతులు శుక్రవారం విలేకరుల ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. వారు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం పొన్నేటిపాళ్యం గ్రామం పనసమాకులపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, కాంతమ్మల కుమారుడు తరుణ్(9) పట్టణంలోని పప్పిరెడ్డిపల్లె పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈనెల 11న భార్య కాంతమ్మ, కుమారుడు తరుణ్‌తో కలిసి సుబ్రహ్మణ్యం రామసముద్రం మండలం చెంబకూరులోని తమ బంధువుల ఇంటికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. రామసముద్రం మార్గంలో ప్రమాదకరమైన మలుపులు ఉండటం, ఆర్టీసీ బస్సు డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ స్పీడ్‌బ్రేకర్ కారణంగా మలుపులో సడెన్ బ్రేక్ వేయడంతో ఎమర్జెన్సీ డోర్‌కు ఆనుకుని కూర్చున్న తరుణ్ ఒక్కసారిగా డోర్ ఓపెన్ కావడంతో బస్సులో నుంచి కిందపడ్డాడు. హుటాహుటిన తరుణ్‌ను తీసుకుని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళితే పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షలు జరిపి తరుణ్ తలకు తీవ్రగాయమైందని, మెదడులో రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ చేయక తప్పదని చెప్పారు. దీనికి సుమారుగా రూ.2–3 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. పేదరికంతో భరించే స్తోమత లేక దాతల సాయాన్ని తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు. తమ బిడ్డను ఆదుకోవాలనే దాతలు 9502461515 ఫోన్‌పే/గూగుల్ పే నంబర్‌కు పంపి ఆదుకోవాలని వారు కోరారు.